వారం వారం కథాప్రభ

# పంజరంలో-చిలక

## బలివాడ కాంతారావు

**రామం కలిగిన కుటుంబంలో ఒక్కడే బిడ్డ. అయినా ఇంకా కలిమిని పెంచాలన్న కోరికలుండవా? అమాయకుడిలా కనిపిస్తున్నాడు. అంత పెద్ద ఉద్యోగం సరిగ్గా చెయ్యగలుగుతున్నాడా?**

రామం గురించి చివరి సందేహం - శ్రీమంతులెందరో మా అమ్మాయిని చేసుకోమని వెంటపడుతుంటే నాకు అప్పుడే పెళ్లి వద్దంటున్నాడు. ముప్పయి మొన్ననే దాటింది. ఆఫీసులో అంత అందమైన స్టెనో వైపైనా తొంగి చూడడే! అసలు రామం ...

ఇన్ని సందేహాలతో సతమతమౌతున్న వాళ్ల మధ్య ఒక శుభవార్త - రామం పెళ్లి చేసుకోడానికి ఇష్టపడ్డాడట. అందరూ అందాన్ని చూస్తూ ముచ్చటపడే పై అంతస్థులో పెరిగిన పిల్లల ఫొటోలు చూపిస్తే ఈ కొడుకు ఒక పిల్లిలాంటి దాన్ని చంకన పెట్టుకొచ్చి దాన్నే పెళ్లాడతానంటాడేమిటి?

"వద్దురా! అంత పని చెయ్యకు!" అంది తల్లి కమలమ్మ - చేతిని నెత్తిమీద పెట్టుకుంటూ.

"మేం ఈ ఇంట్లో ఉండటం ఇష్టం లేదా?" భార్యకు తోడుగా సత్యనారాయణ చిరాకుగా అన్నాడు.

"ఆ అమ్మాయిని చేసుకుంటే మీ అభ్యంతరం ఏమిటి?" అడిగాడు కొడుకు.

"నివ్వన్నది - ఆ ఇద్దరు ఆడపిల్లలున్న ఇంటి అమ్మాయిలో చిన్నది - రత్నప్రభ."

"అవును."

"వాళ్ల నాన్న జిల్లాపరిషత్తులో గుమాస్తా. అద్దె కొంపల్లో మూలుగుతున్నవాడు. ఏడాదికి యేడు సార్లు ఇల్లు మార్చేవాడు. పెద్ద కూతురు ఉరేసుకు చచ్చింది!"

"ఇదంతా మీకెలా తెలుసు?"

"ఊరంతా తెలియగా మాకు తెలియదా?"

"వాళ్లతో మీకు పరిచయమా?"

"నివ్వేం పట్టించుకుంటేగా, నీకు తెలియడానికి. మన రాజప్పలనాయుడు వీధిలోని ఇంట్లో వీళ్లు అద్దెకుండేవారురా! ఆ రత్నప్రభ అంటే నాకు అసహ్యం. బొంగురు గొంతుకతో అరచేది. ఆ చక్రాల్లాంటి కళ్లల్లో నిప్పులు కురిపిస్తుందిరా. కట్టూ బొట్టూ ఆడదానికి అందం ఇస్తుందని తెలుసుకోని అలాంటి రౌడీపిల్లని నా కోడలుగా తెస్తావురా? ఇన్నాళ్లూ నిన్ను ముద్దుగా పెంచి పెద్దచేసి ఇంతగా పైకి తెచ్చిన మేము అదివస్తే ఈ ఇంట్లో ఉండలేంరా!"

ఈ నిష్ఠూరవాక్యాలన్నీ విన్న కొడుకు నిదానంగా-"ఎందుకో ఆడదంటే అలా ఉండాలనిపించింది. ఆమె చేస్తున్న పని చూశాక గౌరవం ఏర్పడింది. మీ అబ్బాయికి పెళ్లి కావాలననుకుంటే వెళ్లి ఆ అమ్మాయి తండ్రిని అడగండి. ఇంతకీ మీతో వియ్యమందడానికి ఒప్పుకుంటాడో, లేదో!"

"నేనా పని చెయ్యలేను, నాయనా!" అనేసింది కమలమ్మ కటువుగా.

"అయితే నన్ను వెళ్లి అడగమంటారా?" అడిగాడు కొడుకు.

"నివ్వెందుకు వెళ్లాలిరా! నేను ఒక పోస్టు కార్డు రాస్తే పరుగెత్తుకుని వస్తాడు!" అన్నాడు తండ్రి.

"అంత తక్కువగా వాళ్లను అంచనా వెయ్యకండి!"

తండ్రి విసుగ్గా "నివ్వు ఈ కుటుంబంలో చిచ్చుపెట్టడానికే ఆ అమ్మాయిని పెళ్లాడతానంటున్నావు. ఆ అమ్మాయి నోరు విప్పితే అగ్నిమంటలు వస్తాయిరా!"

"మీకెలా తెలుసు?"

"ప్రతిరోజూ పేపర్లో ఆవిడ ఉపన్యాసాలు, చేతలు, రాతలు వింటున్నాం, చూస్తున్నాం, చదువుతున్నాం."

"కనీసం ఆ అగ్నిమంటలకు కారణం తెలుసుకున్నారా?"

"నాకు అనవసరం. నీకు అవసరమైతే తెలుసుకో. ఈ ఇంటికి మాత్రం తీసుకురాక!"

"ఆవిడ యేం అపకారం చేస్తుంది?"

"ఈ నాయకురాలి దగ్గరకు ఆడవాళ్ల సమూహం వచ్చి కేకలు, కోలాహలం, ఏడుపులు - ఒకటేమిటి? ప్రశాంతంగా ఉన్న ఈ ఇంటిని ఒక పబ్లిక్ బజారుగా మార్చలేను. మగవాళ్లంటే ద్వేషించే ఈ అమ్మాయి నా మీద విరుచుకుపడదా? నిన్నూ ముద్దిస్తుందా? అత్తగార్లమీద విరుచుకుపడేది మీ అమ్మచేత ఇంట్లో నానా చాకిరీ చెయ్యించదా? మా బొందిలో ప్రాణం ఉండగా ఇది జరగని పని ...!'

"అంతేనా?"

"ముమ్మాటికీ అంతే!" అతని మాటే ఈ ఇంట్లో చెల్లుతుందన్నట్లు కటువుగా సత్యన్నారాయణ తీర్పు ఇచ్చేశాడు.

రామం బయటకు వచ్చి మల్లెపొద చాటున కూర్చుని వింటున్న రత్నప్రభను రమ్మని సైగ చేశాడు. ఇద్దరు పేవుమెంటుమీద మెల్లగా కొంతసేపు మౌనంగా నడుచుకుంటూ పోయారు. రత్నప్రభ మొదట ప్రశ్నించింది.

"ఇన్ని ఇబ్బందులుండగా నన్ను పెళ్లి చేసుకుంటారా?"

"అవసరమైతే వేరే పోదాం."

"అలాగైతే నేను మిమ్మల్ని పెళ్లి చేసుకోను."

"వాళ్లు నివ్వు హింసలు పెట్తావని భయపడ్తున్నారు. అక్కడుంటే నివ్వే హింసలపాలు కావచ్చు."

"ఇన్నాళ్ల పరిచయంతో నా గురించి మీరు తెలుసుకున్నదింతేనా?"

'అది కాదు, మా అమ్మ సంగతి నీకు తెలీదు.'

"మీ అమ్మ ఆడదే కదా! మీరు శత్రువు కావచ్చు కానీ, ఆవిడ నా కెలా శత్రువౌతుంది?"

"ఓహో, మరచాను. ఈ రత్నప్రభగారి ధ్యేయం - మహిళా జనోద్ధరణ కదూ!"

"ఆ ఇంట్లో ఉండే అవకాశం ఉంటేనే మీతో పెళ్లి."

"రిజిష్టర్డు మేరేజ్ చేసుకుని ఆ ఇంట్లో కాలు పెట్తే వాళ్లే ఇంట్లోనికి రానిస్తారు."

"అంత ఊరూ పేరూ ఉంది. అంత బలగం ఉండగా రిజిష్టర్డు మేరేజ్ చేసుకునే ఖర్మ నా వలన మీకు రాకూడదు."

"ఆ పెళ్లిలో ఆ తంతులన్నిటికీ తలొగ్గుతావా?"

"వాళ్ల ముచ్చటలు తీర్చుకుంటామంటే తల వంచుకుని మరీ పుస్తె కట్టించుకుంటాను."

"ఈ క్షణంలో ఇంతగా మారిపోతున్నావ్!"

"నేను చెప్పింది సరిగ్గా వినండి. వాళ్లు కనీ పెంచి పెద్ద చేసినవాళ్లు. నేను మొన్న పరిచయమైన దానిని. వాళ్లేం తప్పు చేశారని వాళ్లని శిక్షిస్తారు? వాళ్లు ఒప్పుకోలేదంటే అది మీ చేతకాని తనం క్రింద వస్తుంది."

"వాళ్ల మొండిపట్టు నీకు తెలీదు."

"ఆ మొండిపట్టును సడలించగలిగే చాతుర్యం లేనివారు అంత పెద్ద ఉద్యోగం ఎలా చేస్తున్నారండీ!"

"ఇది పరీక్షా?"

"అవును. ఇందులో మీరు నెగ్గితేనే మిమ్మల్ని

పెళ్లి చేసుకుంటాను."

"నీది చాలా వింత మనస్తత్వమని ఇప్పుడే తెలుసుకున్నాను."

"గెలుపు, ఓటమి రెండింటినీ నవ్వుతూ స్వీకరించబట్టే మీ దృష్టిలో పడ్డాననుకుంటున్నాను."

"అయితే ఓటమిని గెలుపుగా మారుస్తాను. అప్పుడే నవ్వుతూ నిన్ను స్వీకరిస్తాను."

కొన్నాళ్లకు ఈ ఇద్దరి పెళ్లీ వైభవంగా జరిగిపోయింది. కోడలు ఇంట్లో కుడిపాదం మోపిననాటినించీ క్షణాలు, గంటలు, రోజులూ లెక్కపెడ్తున్నారు అత్తమామలు. ఏ సమయంలో ఈ అగ్నిపర్వతం పేలుతుందోనని భయంగా, ఆత్రుతగా ఎదురుచూస్తుంటే - ఈ అమ్మాయి నెమ్మదిగా ఇంటిపనులన్నీ చేసుకుంటూ, అత్తామామల సేవ చేస్తూ కన్న కూతురు లేకపోయినా అంత అభిమానంగా చూస్తుందనిపిస్తోంది. ఈ ఇల్లు నడిబజారుగా మరుతుందనుకుంటే ఇంట్లో ఒక కేకైనా వినిపించలేదు. ఇదివరకున్న రేడియో, టీ.వీ. శబ్దాలు కూడా బాగా తగ్గిపోయాయి. ఇదేమిటి? కోడలు గృహప్రవేశంతో అత్త అగ్నిప్రవేశం చేస్తుందనుకుంటే అత్తా మామల సేవలో నిమగ్నమైపోయింది. తాను వేసిన అంచనా అంతా తప్పుడు అంచనా అని అనుకున్న సమయంలోనే రామంకు అదే సందేహం కలిగింది.

"నివ్వు ఇలా పంజరంలోచిలకగా మారుతావని తెలిస్తే నిన్ను పెళ్లే చేసుకోకుండా ఉండేవాడిని!" అన్నాడు.

"ఇంకెవరిని పెళ్లి చేసుకునేవారు?"


"నన్ను ముగ్ధుడ్ని చేసేవారిలో ఒక అందమైన అమ్మాయిని ..."

"పెళ్లి చేసుకుని ..."

"ప్రేమ విహారాలు, పిల్లల పెంపకాలు - అంతా రొటీన్ లైఫ్‌లో పడిపోయేవాడిని."

"అబ్బే! నేనేం మారలేదండీ! నేను నేనే! ఇల్లు మారగానే మారిపోతే ..."

"ఏమిటో నేను ఊహించని రీతిగా



మారిపోయావనిపిస్తోంది."

"అప్పుడు ఒక సంఘసేవకురాలిని. ఇప్పుడు ఒక గృహిణిని. నాకు భర్త ఉన్నాడు. అత్తమామలున్నారు. వాళ్లు కాస్త వయసు మళ్లినవారు. వాళ్లకు కొంత హాయినివ్వాలి. వాళ్ల జీవితం సుఖమయం చెయ్యాలి. ఎంచేతంటే వాళ్ల యే

## మొదటి గులాబీలు

గులాబీచెట్లను మొట్టమొదటగా పెంచిన దేశం చైనా. 4500 సంవత్సరాలకు పూర్వం చైనాలో మాత్రమే గులాబీలున్నట్లు తెలిసింది. ఆపై ప్రపంచమంతటా గులాబీలు వెల్లివిరిసాయి. ప్రస్తుతం 2500 రకాలకు పైగా గులాబీలు ప్రపంచంలో ఉన్నాయి.

**శ్రీకొండ** (ఎర్రబోడు)

---

తప్పులు చేసినవారు కారు. అంత కాదన్నవారు నా పెళ్లికి ఒప్పుకున్నారంటే లోలోపల ఏదో ఒక ఆశ ఉన్నట్లే కదా!"

"నివ్వు మళ్లీ సంఘసేవకురాలిగా మారు. అప్పుడు నీకు కనిపిస్తుంది వాళ్ల నిజరూపం! అసలు నాకు తెలియకుండా ఎవర్నీ రానివ్వద్దని నీతో చెప్పారా?"

"నీలో స్వలాభం అన్నది లేనే లేదనుకున్నాను. ఆ మూడుముళ్లతో ఇవ్వాటి నీ బ్రతుకు స్వలాభంతో కుళ్లిపోతోంది."

"అనండి. మీ అభిప్రాయం చెప్పుకునే హక్కు మీకు ఉంది. కోపం వచ్చి నన్ను జనారణ్యంలోనికి తీసుకువెళ్లి విడిచిపెట్టే అధికారం కూడా ఉంది."

"నీలోని నైతిక విలువల శక్తిని కోల్పోయావు. పెళ్లితో నీలో స్వార్థం చోటు చేసుకుని ఆ శక్తిని తరిమేసింది. ఇలా జరుగుతుందని నేనెన్నడూ ఊహించలేదు!" బుంగమూతి పెట్టి అంటే, రత్నప్రభ కొంటెగా నవ్వేసింది.

ఇలా అలా ఒక్కొక్కప్పుడు జరిగే వాదనలు కమలమ్మ చెవికి వెళ్లి ఒకనాడు - "కోడలా! అబ్బాయి ఎందుకలా చిరాకుపడుతున్నాడు?" అడిగింది.

"అబ్బే! ఏమీ లేదండీ!"

"ఏమీ లేకపోవడమేమిటి? ఏదో ఉంటుంది. నేను వినకూడని రహస్యమా?"

"నేను మారిపోయానట! అంచేత నేనంటే అసహ్యపడుతున్నారు."

"ఈ ఇంటిని నడిపే బాధ్యత తీసుకుని ఇంత బాగా నడిపిస్తున్నావు. మీ మామయ్య నేను ఇప్పుడే 'రామా కృష్ణా' అనుకుంటూ సుఖపడుతుంటే - వాడి మాటలు తీసుకోకమ్మా! నీ పక్షాన నేను నిల్చుంటాను."

"లోకంలో అందరు అత్తలూ మీలాగుంటే ఆడవాళ్ల సమస్యలు సగానికి సగం ఉండేవి కావు.'

ఒక రోజు ఉదయాన్నే ఒక సంఘటన జరిగింది. ఒక ఇల్లాలు ఆమె అత్తమామలు మాటలు విని భర్త పెట్టే హింసలు చెప్పుకొస్తుంటే కమలమ్మకు లోకంలో ఇంటి మూర్ఖులుంటారా అనిపించింది. రాడానికి కారణం చివరగా - "వాళ్లెవరి మాటా వినరమ్మా! ప్రభమ్మ గారు మా ఇంటికొచ్చారంటే వాళ్లకి పక్కబెదురు. ఆ యమ్మ పెళ్లయిపోయి పెద్దింటికి వెళిపోయింది. ఇలాంటి తగువుల్లో తలదూర్చనివ్వరు అని మరీ హింసలు పెడుతున్నారు. అమ్మా! ఆ యమ్మని ఒక్కసారి నాతో వచ్చి మా ఇంట్లో అడుగు పెట్టే వాళ్లు నా మీద చెయ్యి చేసుకోరు!"

ఆమె గోడు విన్నాక 'నా కోడలు అడుగు పెట్టే అంత మంచి జరుగుతుందా?' అనుకుని ఒకసారి లోనికి వెళ్లి, "అమ్మా, కోడలా! ఎవరో ఇల్లాలు బాధల్లో ఉంది. నివ్వు వాళ్ల ఇంట్లో కాలు పెట్టే ఆవిడ బతుకు కుదుటపడ్తుందట. ఒకసారి వెళ్తావా?" అని అడిగింది.

"ఈ ఇంట్లో కాలు పెట్టాక అవన్నీ మరచిపోయాను, అత్తగారూ! నా ఇల్లు, వంటా, అత్తమామల సేవ, చుట్టాల దగ్గర సెబాష్ అనిపించుకోవటం - ఇలా ఇంకో జన్మ ఎత్తాననుకుంటున్నాను. మళ్లీ అక్కడకు వెళ్లలేను.'

"పోనీ, ఈ ఒక్కసారి వెళ్లి ఆ కష్ట నివారణ చెయ్యకూడదూ!"

"ఈ ఒక్కదానికి వెళ్తే, రోజూ మనఇంటి దగ్గరకు ఎందరెందరో ఎన్నోబాధలు చెప్పుకోడానికి వస్తారు. ఇలా వాళ్ల బాధలు నా నెత్తినేసుకుంటే ఇంట్లో పనెవరు చేస్తారు? రాలేనని చెప్పేయండి!" అనేసి వంట ఇంట్లో కాయగూరలు తరగడానికి వెళ్లిపోయింది."

కోడలు కాదన్నాదని ఆ ఇల్లాలు వినగానే, "మీలాంటి ఆడాళ్ల బాధలు విని ఆదిశక్తిలా ఉరికిన ప్రభమ్మ ఈ ఇంట్లో పడి కనికరం అంతా కాల్చుకుంది. ఆ యమ్మను మీరే ఇలా మార్చేసినారు. కష్టం అంటే ఏమిటో తెలియని మీకు కష్టపడే వాళ్ల కన్నీరు చూసి కనికరిస్తారా? ఆ పోరు పడలేక ఏ నుయ్యో గొయ్యే చూసుకుంటాను!" అని పెద్ద కేకలతో అని వెళ్లక అక్కడే కూర్చుంది.

కాస్త చలించిన అత్తగారు లోనికి వస్తూ, కోడలితో "ఆ ఇల్లాలు బలవంతాన చచ్చిపోతే ఆ పాపం నాకు చుట్టుకోదూ?"

"ఆ పాప భయం ఉంటే మీరే వెళ్లి సంధాన పర్చకూడదూ?"

"నేనా? నేనేం చెయ్యగలను?"

"మీ మంచి మాటలు వాళ్ల తలకెక్కుతాయేమో? వెళ్లి అనండి. నా కోడలు రాడానికి వీలు పడదు. నన్ను రమ్మంటావా అని అడగండి. పెద్దవారు. మీరు వెళ్లి వాళ్లకు శాంతంగా నచ్చచెప్పితే వినుకుంటారేమో? చెప్పండి. నా కోడలు ఒక రూపాయి కట్నం తేలేదు. ఉత్తి చేతులతో వచ్చినా నేనెంత ముద్దుగా చూసుకుంటున్నానో - అలా చూసుకోమని నచ్చచెప్పండి."

అందుకు ఆ ఇల్లాలు ఒప్పుకుంది. ఇల్లు దగ్గరలోనే ఉందని వెళ్లి కాస్సేపటికే కమలమ్మ తిరిగి వచ్చేసింది.

"వెళ్లిన పని చేసుకొచ్చారా?" అడిగింది కోడలు.

"అదేం మొండి మనుషులమ్మా! మంచి మాటలకు లొంగుతారా? నే నెందుకు వెళ్లానా అనిపిస్తోంది."

"మీకు అవమానించారా? చెప్పండి, ఏం అన్నారా? చేశారా?"

"నన్ను తెచ్చినందుకు ఆ ఇల్లాలిని ఒళ్లు ఎంతగా హూనం చేస్తారో నన్న భయంగా ఉంది. ఒక్కసారి ఆ ఇల్లు చూపిస్తాను, వెళ్లిరామ్మా!" అంది కమలమ్మ.

"అత్తయ్యా! వెళ్తే ఒక చిక్కులో పడిపోతాను. వాళ్ల మాటలకు లొంగనివాళ్లని తేలిపోయింది. పోలీసులచేత లాఠీ ప్రయోగం చెయ్యించాలి. పోలీసులు వాళ్లను కొట్లో తోసి కేసు పెట్టే నేనే ఈ అమ్మాయికి న్యాయవాదిగానైనా వెళ్లాలి. సాక్షిగానైనా వెళ్లాలి. అప్పుడు మీకు ఇబ్బంది కదా! మీకు సుఖపెట్టడానికి కోడలిగా వచ్చాను కానీ, ఇలా ఎందరో కష్టాలతో వస్తూనే ఉంటారు. అవన్నీ నా నెత్తిన వేసుకుంటే ఇక నేను ఇంట్లో ఉండేదెప్పుడు? మీ అందరి క్రిందా సేవ చేసేదెప్పుడు? ఎవరు వచ్చినా 'నా కోడలు ఒక గౌరవ కుటుంబంలో పడింది. పోలీసులూ, కోర్టుల వెంట తిరగలేదు. మీ రెవరూ ఇక్కడకు రాకండి' అని చెప్పేయండి. అప్పటికీ వదలకపోతే వాళ్లను పోలీసులకు అప్పచెప్తానని భయపెట్టండి. ఇక రారు!"

ఇంత ఉపన్యాస ధోరణిలో కోడలి మాటలు విన్నాక మరుసటి రోజు ఇంకో ఆడమనిషి గగ్గోలు పెట్టోంది. తను ఉండగా భర్త ఇంకో స్త్రీతో సంపర్కం పెట్టుకుని తనకూ, ఇద్దరు పిల్లలకూ తిండి కూడా పెట్టకుండా ఎలా హింసిస్తున్నాడో ఏడుస్తూ చెప్పుకుంది. కమలమ్మ లోపలికి వచ్చి టిఫిన్ తయారుచేస్తున్న కోడలితో చెప్పితే, "నేను రాలేనని చెప్పండి!"

"ఆ గోడు విన్నాక అలా చెప్పబుద్ధి పుట్టడం లేదు."

"పిల్లలు ఆకలితో ఉన్నారని చెప్తోంది కదా! ఆ ఇడ్లీలన్నీ తీసుకువెళ్లి పిల్లలకు పెట్టమని ఇచ్చి పొమ్మనండి."

అలా చేసి బలవంతాన ఆ మనిషిని

పంపించాక, కమలమ్మకు అసలు కోడలు చేసిన ఇడ్లీలు తినబుద్ధిపుట్టలేదు. ఎంగిలిపడి ఉదయాన్నే పరుపుమీద వాలింది. ఇద్దరి నోట ఇప్పటికి ఆడవాళ్ల కష్టాలు విన్నా ఇలా ఎన్నెన్నో గొంతుకలు ఒకటి తరువాత ఒకటి ఆక్రందన చేస్తున్నట్ల చెవులు చిల్లులు చేస్తున్నాయి. అంతలో కోడలు గదిలోనికి వచ్చి -

"టిఫిన్ తినలేదు. అజీర్ణం చేసిందా? తలపట్టుకున్నారు - తలనొప్పా? అమృతాంజనం తేనా?"

"వద్దమ్మా! రా, నివ్విలా దగ్గరగా కూర్చో."

కోడలు కుర్చీ లాక్కుని అత్తగారి మంచం పక్కనే కూర్చుంది.

"నివ్వు కోడలయ్యాకే లోకంలో మూడొంతులు కష్టాలే ఉన్నాయని తెలుసుకున్నాను. ఈ కష్టాల్లో మూడొంతులు ఆడవాళ్లే అనుభవిస్తున్నారు కదా! అంతే కదమ్మా!'

అవునన్నట్లు తల ఊపింది.

"అన్నిటికీ తల ఊపుతుంటే నాలాగే నివ్వూ మారతావని భయంగా ఉంది."

"మీకేం అయ్యింది?"

"నా పెళ్లాం నా చెప్పుచేతల్లో ఉందన్న అహంకారం మీ మామయ్యది. ఆ అహంకారం నా మెదడును ఆలోచించని గొర్రెమెదడుగా మార్చేసింది. నేను మొగుడన్న మాటలనే చిలక పలుకుల్లా చెప్పాను. ఒక అందమైన చిలుకను పంజరంలో పెట్టి ఆనందం అనుభవించారు. నిన్నూ అత్తకున్న అధికారంతో చిలుకను చేసి పంజరంలో పెట్టలేను."

"అత్తయ్యా! మీ మాటలు వింటుంటే మీది గొర్రె మెదడు కాదు. చిలుకపలుకులు కావనిపిస్తున్నాయి."

"నీ సాహసంతో ఇప్పుడిప్పుడే ఇదివరకటి నిజాలనుకున్నవన్నీ అబద్ధాలనీ, అబద్ధాలనుకున్నవి నిజాలనీ తెలుసుకుంటున్నాను. నీలో ఈ చైతన్యం రావటానికి ఏదో ఒక బలమైన కారణం ఉండి ఉంటుందనిపిస్తోంది. అదేమిటి కోడలా?"

"జరిగిన విషయం తెలుసుకుని నేను బాధపడటం, మీరు విచారించటం నాకిష్టం లేదు.'

"నా తప్పు తెలుసుకుని విచారించటం నా కవసరం!"

కోడలు అత్తగారి మార్పుకు ఆశ్చర్యపడుతూ చూసి అంది -

"మీరు కోరారు కాబట్టి కాదనలేక చెప్తున్నాను. నా అక్క రమణిని మీరు చూసే ఉంటారు. అమ్మ పోయాక ఇంట్లో పనిపాట్లు చూసుకోవటం వలన చదువు అంతగా అబ్బలేదు. ఇద్దరు ఆడపిల్లల పెళ్లిళ్లంటే సామాన్యమా? ఈ ఆత్రుతతో అక్క పెళ్లి ఆలోచించకుండా చేసేశారు. అత్తవారింట్లో ఆడపడుచులు, అత్తగారు పెట్టిన బాధలు భరించింది. కట్టుకున్న భర్తే మొదట మాటలతోనూ, తరువాత చేతలతోనూ రంపపుకోత కోయగానే భరించలేకపోయింది. ఊర్లో ఉన్న మా ఇంటికీ రానిచ్చేవారు కాదు.. సున్నితమైన మనసు. బాధలను తట్టుకోలేక ఉరేసుకుంది."

అని చెప్తూ, కాస్సే ఆగేక ఉబికే కన్నీటిని ఆపుకుంటూ - "అలా వేలాడుతున్న అక్క శవాన్ని చూశాను. అప్పటికి నేను బి.ఏ. పాసయ్యాను. వెంటనే 'లా' కాలేజీలో చేరాను. లాయరయ్యాను. ఏ ఆడది బాధపడుతూ నా వద్దకు వచ్చినా అలా వేలాడుతున్న నా అక్క శవం కనిపిస్తుంటుంది. 'నేనే జీవితం మీద విసిగి చచ్చిపోతున్నాను. నా ఆత్మహత్యకు ఎవ్వరూ బాధ్యులు కారని' ఉత్తరం రాసి మరీ చచ్చిపోయింది. ఎంత అమాయకురాలు? నేరస్థులకు శిక్ష తప్పించి ఎంత తెలివి తక్కువపని చేసింది? అందుకే 'స్త్రీ జనోద్ధరణ సంఘం' అని స్థాపించి, నా ఊహలతో ఏకీభవించే మరికొందరిని చేర్చి నడుపుతుంటే మీ అబ్బాయి దృష్టి నా మీద పడింది. ఇప్పుడు సుఖపడ్తున్నానుగా!" అంటూండగానే కమలమ్మ కళ్లు ఒత్తుకుంటోంది.

"అత్తయ్యా! మీరు ఏడుస్తారనే నేను చెప్పనన్నానా?"

"అందుకు ఏడవలేదమ్మా! ఈ బలవంతం చావు వెనుక గుండెను కదలించే విషయం ఉంటే, నేనే అవి చులకనగా తీసుకుని 'నీ అక్క ఆత్మహత్య చేసుకుంది - ఆ ఇంటి పిల్లను కోడలిగా చేసుకోను' అన్నాను."

"ఐనా నన్ను మీ కోడలిగా ఇంట్లో కాలు పెట్టించారు కదా! అదే మీది గొప్ప మనసని మీకు హాయి నివ్వాలన్నదే నా కోరిక."

"అమ్మా! ఈ వంటా పెంటా, ఇల్లూ - వాకిలీ ఎవరైనా చూసుకోగలరు. నీలాంటి ధైర్యం, తెలివితేటలు, పరోపకారబుద్ధి కలిగినవాళ్లు చెయ్యవలసిన పనులు కావివి. పెళ్లికాకముందు ఏ పనులు చేసి ఎందరి అభాగినుల కన్నీరు తుడచావో, అదే చెయ్యమ్మా! నాకు సమర్ధురాలైన కోడలుందని గర్వంతో చచ్చిపోతాను!"

"ఇది ఆదేశమా అత్తయ్యా?"

"అవునమ్మా! నా మనసారా దీవించి మరీ పంపిస్తున్నాను. ఇలానైనా నీ పుణ్యంలో కొంత పుణ్యమైనా నన్ను సంపాదించుకోనీ ... వెళ్లు, ఆ ఇల్లాలిఇల్లు నీకు తెలుసు కదూ? అది ఏ అఘాయిత్యం చేసుకోకముందే వెళ్లు!" అని లేచి పంపిస్తుంటే,

"మామయ్యగారేమంటారో?"

"ఇంట్లో నలుగురిలో ముగ్గురిది ఒకే మాటయినప్పుడు, ఆయన కాదంటే ఆ మాట నెగ్గుతుందా? వెళ్లమ్మా, వెళ్లు!"

అంగటి గేటు దగ్గర ఎదురుపడ్డ రామం - "ఎక్కడికి?"

"స్త్రీ జనోద్ధరణకి."

"అమ్మ ఒప్పుకుందా?"

"ఆమే బలవంతం చేసి పంపిస్తోంది."

"అమ్మను ఎలా మార్చగలిగావు?"

"నాకో నమ్మకం ఉంది."

"ఏమిటది?"

"మనం అనుకున్న మంచి, చెడ్డవాళ్లలో ఒక్క గుణం సామాన్యంగా ఉంటుంది."

"ఏమిటది?"

"దాన్నే కరుణ అంటాం. కొందరిలో ఇది అజ్ఞానంతోనో, అహంతోనో, స్వార్థంతోనో కప్పబడి ఉంటుంది. నాలాంటి సంఘసేవకురాలు ఆ అడ్డును తొలగించడానికే పాటుపడాలి."

"దానికి ఒక పరికరం ఉండాలి కదా!"

"దాన్నే తెలివి, బుద్ధి, వివేకం, జ్ఞానం, ప్రతిభ - ఏ మాటతోనైనా పిలవచ్చు. ఆ చెడ్డవాళ్లనించి కరుణరసం మళ్లీ పారించాలంటే ఆ కరుణ రసంతోనే ఆ చెడును ఛేదించాలి!" అంటూ రత్నప్రభ ముందుకు కదలింది.

P

